మైన్స్ లారీ బోల్తా.. స్తంభించిన రాకపోకలు

రాయచూరు, మే 17 : జిల్లాలోని మాన్వి తాలూకా కపగల్ క్రాస్ వద్ద ప్రధాన రహదారిపై వెళుతున్న మైన్స్ లారీ శుక్రవారం తెల్లవారు జామున బోల్తా కొట్టింది. హెవీ లోడ్‌తో వెళుతున్న లారీ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ఈ మార్గంలో దాదాపు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. చిన్న వాహనాలు దారి మళ్లించిపోయినా పెద్ద వాహనాలకు ప్రత్యామ్యాయ మార్గం లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఆస్పత్రికి వెళ్లేవారు సైతం చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. మాన్వి పోలీసులు రాకపోకలను పునరుద్ధరించేందుకు ఉదయం 8:30 గంటల వరకు శ్రమించాల్సి వచ్చింది.





స్థానిక సమరానికి అడ్డంకులు

తొలగేదెన్నడో..?

- మూడేళ్లుగా జిల్లా, తాలూకాలకు ఎన్నికలే లేవు
- మూడున్నరేళ్లుగా పాలకవర్గంలేని బీబీఎంపీ
- మూడు ప్రభుత్వాలు మారినా సమస్య యథాతథం

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): అధికార వికేంద్రీకరణ జరగాలంటే స్థానిక సంస్థల్లో పాలకవర్గాలు ఉండాలనే ఆశయం నీరుగారుతోంది. స్థానిక సంస్థల బలోపేతానికి దేశంలోనే కర్ణాటక అధిక ప్రాధాన్యత ఇచ్చిందనే పేరుంది. ఇప్పటికీ దేశంలో ఎక్కడా లేనన్ని సహకారసంఘాలు, కో-ఆపరేటివ్‌బ్యాంకులు కల్గిన రాష్ట్రంగా ప్రత్యేకత ఉంది. గ్రామస్థాయిలో స్థానిక సమస్యల పరిష్కారానికి అనుకూలంగా ఉండాలనే గ్రామ, తాలూకా, జిల్లా పంచాయతీలను ఏర్పాటు చేశారు. ఐదేళ్లకోసారి స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు పెంచడం, స్థానిక సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే పరిష్కరించాలనేది ఆశయంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తాలూకా, జిల్లా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్ని అడ్డంకులు ఉన్నాయో వాటిన్నింటినీ ప్రయోగిస్తున్నట్టుగా ఉంది. జిల్లా, తాలూకా పంచాయతీల పాలకవర్గాల గడువు 2021 ఏప్రిల్‌లోనే ముగిసింది. మూడేళ్లుగా ఎన్నికలు జరపకుండా కాలయాపన చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యత ఎక్కువ జనాభా కలిగి ఉండడమే కాకుండా అత్యంత ఎక్కువ ఆదాయం కల్గిన రాజధాని బెంగళూరుకు అనుబంధమైన బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కు పాలకవర్గం లేక మూడున్నరేళ్లయింది. 2020 సెప్టెంబరుకు పాలకవర్గం గడువు ముగిసింది. ఎన్నికలు జరిపేందుకు ఇటీవల వరుసగా ప్రభుత్వాలు మీనమేషాలు వేస్తున్నాయి. ఏ చిన్న సాకు దొరికినా అదే కారణంగా చూపి వాయిదా వేస్తున్నాయి.

కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ప్రభుత్వం ఏదైనా అందరికీ ఒకే విధానం అనేలా సాగుతోంది. రాష్ట్రంలోని జిల్లా, తాలూకా పంచాయతీలకు ఎన్నికలు 2021లోనే జరగాల్సి ఉండేది. అప్పటి బీజేపీ ప్రభుత్వం వార్డుల పునర్విభజన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సదరు కమిషన్ నివేదికలను సిద్ధం చేయడంలోనే కాలయాపన చేసింది. ఎన్నికల కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసినా ప్రభుత్వం మాత్రం నిర్ణయంలో మార్పులేదనేలా వ్యవహరించింది. ఆ తర్వాత స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ గుర్తించేందుకు సంబంధించిన కమిటీని ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు సూచనకు అనుగుణంగా ఈ తరహా చర్యలు అమలు చేయడం అనివార్యంగా ఉండేది. ఆ తర్వాత అస్తిత్వంలోకి వచ్చిన న్యాయమూర్తి భక్తవత్సల కమిటీ నివేదిక ఇచ్చింది. అయినా జిల్లా, తాలూకా పంచాయతీల ఎన్నికలను నిర్వహించే ఆలోచనవైపు ప్రభుత్వం అడుగులు వేయలేదు. స్థానిక సంస్థల్లో శక్తిని నింపేలా పాలకవర్గాలు ఏర్పాటు చేసినా ప్రభుత్వం మౌనంగా ఉంది.

మూడున్నరేళ్లుగా పాలనకు దూరంగా బీబీఎంపీ


బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) పాలకవర్గం గడువు 2020 సెప్టెంబరులోనే ముగిసింది. ఎన్నికలకు నిర్వహించేందుకు పలుమార్లు వాయిదాలు పడుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 2013 నుంచి 2018 దాకా బీబీఎంపీ విభజనకు సంబంధించి మాజీ అధికారులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ నివేదికపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వదిలేశారు. 2019లో బీజేపీ పాలనలో బీబీఎంపీ వార్డుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. 198 వార్డుల నుంచి 234కు పెంచుతూ గెజిట్‌ను విడుదల చేశారు. ఎన్నికలు జరిపేందుకు సాధ్యం కాలేదు. మళ్లీ ఏడాది క్రితం కాంగ్రెస్ అధికారంలోకి రాగా 225 వార్డులకు కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. బీబీఎంపీ ఎన్నికల అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఓబీసీల ప్రాతినిధ్యంపైనా (జాబితా విడుదల చేయాల్సి ఉంది. దీంతో ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయి.

ఎమ్మెల్యేల నిరాసక్తత

జిల్లా, తాలూకా పంచాయతీలతో పాటు మహానగర పాలికె ఎన్నికల విషయంలో ఎమ్మెల్యేలు ఆసక్తి చూపలేదు. పార్టీ ఏదైనా ఎమ్మెల్యేలందరూ ఒకే అభిప్రాయంతో ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. స్థానికంగా తాలూకా, జిల్లా పంచాయతీ సభ్యులు కార్పొరేటర్లు లేకుంటే సదరు సంస్థల్లో కూడా తమదే హవా ఉంటుందనే ఎత్తుగడగా ఉంది. పాలకవర్గం లేకుంటే అధికారుల ద్వారా మాత్రమే అన్ని వ్యవహారాలు కొనసాగాల్సి ఉన్నా ఎమ్మెల్యేలు తమ ప్రాబల్యాన్ని చాటుతూ వస్తున్నారు. బీబీఎంపీకి ఏటా వేల కోట్ల రూపాయల బడ్జెట్ ఉంటుంది. కార్పొరేటర్లు ఉంటే వారి పర్యవేక్షణ, వారికి అనుకూలమైన వారి ద్వారా అభివృద్ధి పనులు అమలు చేస్తారు. పాలకవర్గం లేకుంటే అన్ని అభివృద్ధి పనులు ఎమ్మెల్యేల ద్వారానే కొనసాగుతాయని తద్వారా ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చునని భావిస్తున్నారు. జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నాలుగు వారాలలో పునర్విభజన పూర్తి చేసి రిజర్వేషన్లు ప్రకటించాలని, 2023 నవంబరులోనే హైకోర్టు గడువుపెట్టింది. ఈలోగానే ఎన్నికలు జరుపుతామని అధికారులు వివరణ ఇచ్చారు. డిసెంబరులో వాయిదా సందర్భంలో లోక్‌సభ ఎన్నికల వస్తున్నాయని, ప్రస్తుతానికి స్థానిక సంస్థల ఎన్నికలు జరపలేమని వివరణ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఈలోగా ఆరు స్థానాలకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. ఇదంతా జూన్ మొదటివారంతోనే ముగుస్తుంది. ఆ తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. జిల్లా, తాలూకా పంచాయతీల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. ప్రభుత్వమే ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పాసా.. ఫెయిలా...?

- 5, 8, 9 తరగతుల విద్యార్థుల్లో సందిగ్ధత
- తల్లిదండ్రుల ఆందోళన



బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యాసంవత్సరం మరికొన్ని రోజుల్లోనే ప్రారంభం కానుంది. నెలలక్రితం రాసిన పరీక్షల ఫలితాలు ఎటూ తేలలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా 5, 8, 9 తరగతులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. సదరు విద్యార్థులు పాస్ అయినట్టా.. ఫెయిల్ అయినట్టా అనేది గందరగోళంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదో తరగతిలో 9,30,715 మంది, ఎనిమిదో తరగతిలో 9,35,076 మంది, తొమ్మిదో తరగతిలో 9,40,313 మంది మార్చి నెలలో పరీక్షలు రాశారు. 69,137 పాఠశాలల నుంచి 28,14,104 మంది పరీక్షల్లో పాల్గొన్నారు. వారంతా తర్వాతి తరగతులలో చేరేందుకు సిద్ధమయ్యారు. అందుకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, ఇతరత్రా సౌలభ్యాలను సిద్ధం చేసుకుంటున్నారు. విద్యాశాఖ 5, 8, 9 తరగతి విద్యార్థులకు సంబంధించిన ఫలితాలను మినహాయించి మిగిలిన తరగతుల విద్యార్థులకు ఉత్తీర్ణతను ప్రకటించాలని డీడీపీఐ అధికారుల ద్వారా సమాచారం ఇచ్చారు. స్టేట్ సిలబస్ చదివే ప్రభుత్వ, అనుబంధ పాఠశాలల విద్యార్థులు మార్చిలో పరీక్షలు రాశారు. ఇందుకు సంబంధించిన వివాదం హైకోర్టు, సుప్రీంకోర్టులో కొనసాగింది. స్టూడెంట్ ట్రాకింగ్ సిస్టమ్ (సాట్స్)లో 5, 8, 9 తరగతుల విద్యార్థుల ఫలితాలను అప్‌లోడ్ చేయరాదని విద్యాశాఖ సూచించింది. కోర్టు సూచనతో సాట్స్‌లో నమోదు చేయరాదని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ కారణంగా మార్కుల జాబితాను ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వీరిలో అందరూ ఉత్తీర్ణులైనట్టా లేదా ఫెయిల్ అయ్యారా అనేది గందరగోళంగా మారింది. 2023-24 విద్యాసంవత్సరంలో ఎఫ్ఏ 1, 2, 3, 4 ఎస్ఏ 1, 2, పరీక్షల ఫలితాలను ప్రతినెలా హాజరుకార్డులో నమోదు చేసి ప్రమోట్ చేస్తారు. ఇదే విధానం ఒకటి నుంచి తొమ్మిదో తరగతిదాకా కొనసాగేది. కానీ 5, 8, 9 తరగతులకు రాష్ట్ర విద్యాశాఖ కొత్తగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించింది. ఈ విధానాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఈ మేరకు వారు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా తీర్పు రాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం ధర్మాసనం హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. ఇలా 28లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గందరగోళంలో పడ్డారు.

ఎస్ఎస్ఎల్‌సీలో గ్రేస్ మార్కులు ఎందుకు?

- అధికారులపై మండిపడ్డ డీసీఎం
- వచ్చే ఏడాది నుంచి గ్రేస్ ఉండదన్న సీఎం



బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఎందుకు..? అంటూ ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత వివిధశాఖలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య డీసీఎం డీకే శివకుమార్, వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి తదితరులు పాల్గొన్నారు. విద్యాశాఖకు సంబంధించిన సమీక్ష వేళ ఈ ఏడాది ఎస్ఎస్ఎల్‌సీలో ప్రతి సబ్జెక్టుకు 20 గ్రేస్ మార్కులు ఎందుకు ఇచ్చినట్టు అని ప్రశ్నించారు. ఇదే విషయమై సుదీర్ఘంగా చర్చ సాగింది. వచ్చే ఏడాది నుంచి ఎస్ఎస్ఎల్‌సీలో గ్రేస్ మార్కులు రద్దు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. కరువు నిర్వహణ కోసం కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రైతుల ఖాతాలకు జమ చేయడం, పశుగ్రాసం కొరత, తాగునీటి అంశాలపై సమీక్ష జరిపారు. ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉందని పాలనాయంత్రాంగం తటస్థంగా ఉండడం సరికాదని సీఎం సూచించారు. అధికారులు ప్రజాసమస్యలపై స్పందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్యారెంటీలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. ఎన్నికల వేళ కర్ణాటక గ్యారెంటీలను అందరూ కొనియాడారు. అయితే రాష్ట్రంలో ఆర్థికంగా గ్యారెంటీలకు ఎక్కువనిధులు కేటాయించాల్సి వస్తున్నందున ఆచితూచి వ్యవహరించే పరిస్థితి ఏర్పడింది.

సైబర్ భద్రతపై అవగాహన పెరగాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పీ సందేశ్

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ భద్రత సమాజానికి చాలా ముఖ్యమని, దానిపై అవగాహన పెరగాల్సి ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పీ సందేశ్ పేర్కొన్నారు. జడ్‌స్కేలర్, ఐఎస్ఏసీ ఫౌండేషన్ సంయుక్తంగా నగరంలో కాప్ కనెక్ట్ కెఫెను శుక్రవారం ప్రారంభించారు. సైబర్ భద్రతా పరిహారాల ద్వారా సమాజంలో చైతన్యం తేవడమే కాప్ కనెక్ట్ కెఫె లక్ష్యంగా ఉంది. సైబర్ సెక్యూరిటీ దేశంలో ప్రధానమైన అంశమైందని హైకోర్టు న్యాయమూర్తి తెలిపారు. రెండు సంస్థలు లాభాపేక్ష లేకుండా దయానందసాగర్ అకాడమీలో ఏర్పాటు చేశాయన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు నిపుణుల మార్గదర్శకం సాయం పొందడం, సమాజానికి సురక్షితమైన మార్గాలను వివరించేందుకు ప్రయోజనకారి కానుందన్నారు. సీఎస్ఈ హెచ్ఓడీ కవితా, ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, జడ్‌స్కాలర్ సీఎస్ఆర్ హెడ్ అఖిల్ అరెన్ డైరెక్టర్ ఆనందనాయుడుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్‌స్కాలర్ సంస్థ సైట్ మేనేజింగ్ డైరెక్టర్ విశాల్‌గౌతమ్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో స్వచ్ఛభారత్ అభియానతో పోలిస్తే సైబర్ సెక్యూరిటీ ఓ బృందం ఆటగా మారిందని, దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించే దిశగా రెండు సంస్థలు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు.

కాప్ కనెక్ట్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పీ సందేశ్ తదితరులు



పరప్పన వాసులకు జామర్ కష్టాలు..!

- జైలులో జామర్ల ఏర్పాటు
- అత్యవసరాల కోసం అవస్థలు
- మొబైల్ నెట్‌వర్క్ కోసం ఉరుకులు పరుగులు

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మొబైల్ నెట్‌వర్క్ లేకపోతే అరగంట కూడా గడవని ఆధునిక కాలంలో వేలాది మంది ప్రజల జనజీవనం కష్టతరంగా మారుతోంది. వారెవ్వరూ నేరస్తులు కాదు. జైలులో గడుపుతున్న నేరస్తులు అంతకంటే కాదు. కానీ నిత్యం మొబైల్ కోసం తల్లడిల్లుతున్న పరిస్థితి కొనసాగుతోంది. అంబులెన్స్, పోలీసులు, అగ్నిమాపక యంత్రాల వంటి అత్యవసర సేవలు పొందడం కూడా కష్టతరంగా మారింది. బెంగళూరు అంటేనే ఐటీ నగరిగా పేరొందినది. నగర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఐటీ, కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులు ఉన్నారు. వీరంతా నగర పరిధిలో వారికి అనుకూలమైన ప్రాంతాలలో నివసిస్తున్నారు. ఎలక్ట్రానిక్ సిటీకి అనుబంధంగా ఉన్నా పరప్పన అగ్రహార ప్రాంతంలో నివసించేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఐటీ కంపెనీలకు సమీపంలో ఉంటామని భావించి పరప్పన అగ్రహారలో చేరినా కేవలం రోజుల వ్యవధిలోనే వదిలి పరుగులు తీస్తున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్దదిగా ఉండే పరప్పన అగ్రహారలోని సెంట్రల్ జైలులో ఖైదీలు తరచూ మొబైల్ వాడుతున్నారని, ఇక్కడి నుంచే బెంగళూరులోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రౌడీయిజం చేస్తుంటారనే ప్రచారం ఉంది. ఇటీవల పలువురి అరెస్టు ద్వారా ఏకంగా జైలు నుంచే ఉగ్రవాద కార్యకలాపాలు సాగుతున్నాయనేది ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ జైళ్లశాఖ కఠిన చర్యలకు సిద్ధమైంది. పరప్పన అగ్రహార జైలులో అత్యాధునిక సాంకేతికమైన జామర్లను అమర్చారు. దీంతో జైలులో మొబైల్ నెట్‌వర్క్ లేకుండా పోయింది. జైలులోని ఖైదీలు, విచారణ ఖైదీల ఆగడాలను కట్టడి చేయాలని భావించి తీసుకున్న నిర్ణయం ఎందరిపాలిటో శాపంగా మారింది. పరప్పన అగ్రహార జైలుకు రెండు కిలోమీటర్ల పరిధిలోని మొబైల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదు. పిల్లలను పాఠశాలల నుంచి తీసుకురావాలన్నా, జొమోటో, స్విగ్గీలలో ఫుడ్ ఆర్డర్ చేసేందుకు వీలు లేకుండా పోయిందని స్థానికులు మండిపడుతున్నారు. అవినీతి అధికారులు జైళ్లలోని ఖైదీలకు మొబైల్ ఫోన్లు సమకూర్చిన తంటా వేలాది మంది సామాన్యులకు జామర్లతో శిక్ష అనుభవించినట్లుగా మారింది.



పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు

పట్టుబడ్డ అంజలి హంతకుడు గిరీశ

బెంగళూరు, మే 17(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్లిలో అంజలి అనే యువతిని దారుణంగా హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు గిరీశ్ సావంత్ అనూహ్యంగా పట్టుబడ్డాడు. మైసూరు నుంచి హుబ్బళ్లికి రైలులో ప్రయాణిస్తూ మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో తోటి ప్రయాణికులు చితకబాదారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో గురువారం రాత్రి కిందకు దూకి తీవ్రంగా గాయపడ్డాడు. దావణగెరెలో గిరీశ్‌ను గుర్తించిన పోలీసులు హుబ్బళ్లి పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. హుబ్బళ్లికి తరలించి కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించినట్టు హుబ్బళ్లి-ధారవాడ పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ తెలిపారు. గిరీశ్ కోసం పోలీసు బృందాలు గాలింపులు కొనసాగించాయన్నారు. దావణగెరెలో గిరీశ్ తీవ్రంగా గాయపడినట్టు సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు అదుపులోకి తీసుకున్నామన్నారు. గిరీశ్ అపస్మారక స్థితిలో ఉన్నాడని చికిత్సలు కొనసాగుతున్నాయన్నారు. అతడిపై నాలుగు కేసులు ఉన్నట్టు కమిషనర్ తెలిపారు.



పరిషత్ పోరులో రెబెల్స్






- అభ్యర్థి రామోజిగౌడపై ఈసీకి ఫిర్యాదు

బెంగళూరు, మే 17(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఆరు స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లోనూ రెబెల్స్ బెడద తీవ్రమైంది. ఈశాన్య పట్టభద్రుల స్థానం నుంచి బీజేపీ మద్దతుతో అమరనాథ్ పాటిల్ నామినేషన్ దాఖలు చేయగా సురేశ్ సజ్జన్ రెబెల్‌గా నామినేషన్ వేశారు. నైరుతి పట్టభద్రుల స్థానం నుంచి బీజేపీ మద్దతు అభ్యర్థిగా ధనంజయ్ సర్జీ నామినేషన్ వేయగా.. మాజీ ఎమ్మెల్యే రఘుపతిభట్ రెబెల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ మద్దతుదారుడిగా ఆయనూరు మంజునాథ్ నామినేషన్ వేయగా ఎస్పీ దినేశ్ రెబెల్‌గా పోటీ చేస్తున్నారు. నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎన్డీయే మద్దతు అభ్యర్థిగా జేడీఎస్‌కు చెందిన బోజేగౌడ నామినేషన్ వేయగా బీజేపీ నేత డాక్టర్ హరీశ్ ఆచార్య రెబెల్‌గా నామినేషన్ వేశారు. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి బీజేపీ మద్దతు అభ్యర్థిగా నింగరాజు నామినేషన్ దాఖలు చేశారు. చివరగా ఈ స్థానం జేడీఎస్‌కు అప్పగించడంతో వివేకానంద నామినేషన్ వేశారు. నింగరాజు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇదే స్థానం నుంచి జేడీఎస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ శ్రీకంఠేగౌడ రెబెల్‌గా నామినేషన్ వేసేందుకు గురువారం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన నామినేషన్ వేసేందుకు కేంద్రం వద్దకు వచ్చే ప్రయత్నం చేశారు. ఉపాధ్యాయులతో కలసి మైసూరులో ర్యాలీ జరిపి ఆ తర్వాత నామినేషన్ వేయనున్నారు. అంతలోనే జేడీఎస్ కోర్ కమిటీ చైర్మన్ జీటీ దేవెగౌడ, ముఖ్యనాయకులు సా రా మహేశ్, మంజేగౌడ, పుట్టరాజులు అక్కడికి చేరుకుని కుమారస్వామితో చర్చలు జరిపేందుకు రావాలంటూ డిమాండ్ చేశారు. మరోవైపు ఆయన మద్దతుదారులు ససేమిరా అన్నారు. రెండు గ్రూపులుగా మారి శ్రీకంఠేగౌడను తోపులాటలో లాగారు. ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. డాక్టర్లు విశ్రాంతి అవసరమని తెలిపారు.



అభ్యర్థి రామోజిగౌడపై ఈసీకి ఫిర్యాదు

బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి రామోజిగౌడ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి బహుమతులను పంచేందుకు చేసిన ప్రయత్నాలపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు సురేశ్‌కుమార్, చలవాది నారాయణస్వామి, రామమూర్తి ఓ కొరియర్ ఏజెన్సీ గోడౌన్‌లో నిల్వ చేసిన బహుమతి కవర్లను బహిర్గతం చేశారు. అనంతరం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నామినేషన్ల పరిశీలనలు శుక్రవారం జరిగాయి. 19 నామినేషన్లను తిరస్కరించినట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. బరిలో ఈశాన్య పట్టభద్రుల స్థానంలో 25 మంది పురుషులు, ఒక మహిళతో కలిపి మొత్తం 26మంది, బెంగళూరు పట్టభద్రుల స్థానం నుంచి 16మంది, నైరుతి ఉపాధ్యాయ నుంచి 9మంది, నైరుతి పట్టభద్రుల స్థానం నుంచి 12మంది, దక్షిణ ఉపాధ్యాయ నుంచి 13 మంది బరిలో ఉన్నారు. ఆగ్నేయ ఉపాధ్యాయ స్థానానికి వివరాలను శనివారం ప్రకటిస్తామని ఎన్నికల కమిషన్ వెల్లడించింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.57	1,578.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	00	1970
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	00	235
సామర్థ్యం (టీఎంసీలు)	3.40	3.72

ఆగిపోయిన ఆధునికీకరణ



ఆగిపోయిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు

- కొత్తగా రూ.400 కోట్ల పనులకు టెండర్ పిలిచినా అగ్రిమెంట్‌కు ముందుకురాని కాంట్రాక్టర్లు
- జగన్ ప్రభుత్వ వైఖరితో టీబీ బోర్డులో అధ్వాన పరిస్థితి
- రూ.500 కోట్ల బిల్లుల పెండింగ్
- టీబీడ్యాం నీరు బంద్ అయినా పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

బళ్లారి, మే 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింద ఉండే ఎగువ (హెచ్చెల్సీ), దిగువ(ఎల్లెల్సీ) కాలువల ఆధునికీకరణ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ప్రతి ఏటా తుంగభద్ర డ్యాం నుండి కాలువలకు నీరు ఆగిపోగానే ఆధునికీకరణ పనులు చేసేందుకు రంగంలోకి దిగే కాంట్రాక్టర్లు ఈ ఏడాది నీరు నిల్చిపోయి నెలన్నర రోజులు గడిచినా పనులు ప్రారంభించలేదు.

2023-24లో తుంగభద్ర డ్యాం పరిధిలో ఎగువ, దిగువ కాలువల ఆధునికీకరణ పనులకు రూ. 400 కోట్లతో టెండర్లను పిలిచారు. ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నా అగ్రిమెంట్ చేసుకోలేదు. 2021-22, 2022-23లో సుమారు రూ. 500 కోట్ల పనులను ప్రారంభించారు. వీటిలో కొన్ని పనులు పూర్తి కావస్తున్నాయి. మరి కొన్ని పనులు మధ్యలో కొనసాగుతున్నాయి. వీటికి సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వాస్తవానికి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకుంటారు. ఈ పనిని ఈ విదంగా ఇంత కాలంలో పూర్తి చేస్తామని అగ్రిమెంట్ చేసుకుంటారు. కానీ కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఏపీ ప్రభుత్వం నుండి బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు.

మామూలుగా తుంగభద్ర బోర్డు నిబంధనల ప్రకారం బోర్డు పరిధిలో జరిగే ఏ పనులకు అయిన ముందుగా ఏపీ ప్రభుత్వం ముందుగా నిధులు చెల్లించాలి. తరువాత అందులో 45 శాతం నిధులను కర్ణాటక ప్రభుత్వం ఏపీ ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తుంది. ఏపీలో జగన్ ప్రభుత్వంలో చేసిన రూ. 500 కోట్ల పనులకు బిల్లులు రాలేదు,



హెచ్చెల్సీ(ఫైల్)

చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వడ్డీలకు అప్పులు తెచ్చి బిల్లులు రాని కారణంగా ఆస్తులు అమ్ముకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర బోర్డు చరిత్రలో ఏపీలో జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బోర్డుకు రావాల్సిన నిధులు రాకుండా పోయాయని కాంట్రాక్టరు పేర్కొంటున్నారు. ఇప్పటికే పూర్తి కావాల్సిన తుంగభద్ర కాలువల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కాలువల్లో పనులు మధ్యలో నిలిపివేయడం వల్ల నీరు పారుదల కాక గతేడాది అనేక చోట్ల గండి పడి నీటి సరఫరా నిల్చిపోయి ంది. దీంతో అనేకచోట్ల రైతుల పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోయాయి. ప్రస్తుత ఏడాది కూడా కాలువలకు నీరు బంద్ అయినా పనులు చేయడం లేదు, ఇందుకు ప్రధానంగా బిల్లులు రాకపోవడమే కారణమని తెలుస్తోంది.

ఆధునికీకరణ పనులు పూర్తి కాకుంటే పొలాలకు నీటి సరఫరా సమయంలో అంతరాయం కల్గుతుందని దీని కారణంగా తాము నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20న జిందాల్ ఫ్యాక్టరీ వద్ద నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ సత్యబాబు తదితరులు

బళ్లారి సిటీ, మే 17: జిల్లాలోని జిందాల్ ఉక్కు ఫ్యాక్టరీలో ఇటీవల ముగ్గురు వ్యక్తులు మరణించిన సంఘటనపై న్యాయవిచారణ జరపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జె.సత్యబాబు డిమాండ్‌చేశారు. ఇందుకోసం ఈనెల 20న ఫ్యాక్టరీ పాత గేటు ఎదుట సీఐటీయూ, మహిళా, దళిత, యువజన, విద్యార్థి సంఘాలు సంయుక్తంగా నిరసన తెలపనున్నట్లు తెలిపారు. నగరంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఇటీవల చనిపోయిన ఒక్కొక్కరికి సుమారు రూ.32లక్షల చొప్పున పరిహారం అందజేస్తున్నారని, ఇక్కడ జరిగిన అనేక ప్రమాదాలు వెలుగులోకి రావడం లేదన్నారు. ఇక్కడ భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో కార్మికులు ప్రాణభయంతో ఉన్నారన్నారు. యువ ఉద్యోగులు భువనహళ్లి గ్రామానికి చెందిన బంతి జడెప్ప(31), చెన్నైకు చెందిన శివమహదేవ్(22), బెంగళూరుకు చెందిన సుశంత్ కృష్ణ నైనారు(31) మృతిచెందినా ఇప్పటివరకు జిల్లాకు చెందిన కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్, ఎమ్మెల్యే తుకారాం గానీ ఆరా తీయలేదని, కార్మికుల గురించి మాట్లాడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలి



వినతి పత్రం సమర్పిస్తున్న తుంగభద్ర రైతులు

బళ్లారి సిటీ,మే 17: సిరుగుప్ప తాలూకాలోని సాగు నీటి ప్రాజెక్టుల కు మరమ్మతులు చేయాలని తుంగభద్ర రైతు సంఘం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమ గౌడ్‌తో పాటు సిరుగుప్ప, తాలూకాలోని ఇబ్రాంపుర, మన్నూరు సోగూర్, కురిగనూర్ గ్రామాల రైతులు డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు వినతి పత్రం సమర్పించారు. ఈసమయంలో ఇబ్రాంపూర్‌కు చెందిన వీరనగౌడ, బసవన్‌గౌడ, సాగర్ గౌడ తదితరులున్నారు.

తట్టు-రుబెల్లా వ్యాక్సిన్‌ని వేయించండి



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది

బళ్లారి సిటీ, మే 17: పిల్లలకు మీజిల్స్-రుబెల్లా సహా 12 ప్రాణాంతక వ్యాధులకు టీకాలు వేయించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని గుగ్గరహట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శేగుప్తా షాహీన్ కోరారు. సంచార జాతులు అధికంగా ఉండే పద్మావతమ్మ నగరంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరంలో ఆమె మాట్లాడుతూ మీజిల్స్ అనేది ఒక అంటు వ్యాధి అని, ఇది పిల్లలలో వైకల్యం లేదా మరణానికి కూడా కారణమవుతుందన్నారు. తుమ్ముల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. దురద, విపరీతమైన జ్వరం, దగ్గు, ముక్కుకారడం, కళ్లు ఎర్రబడటం తట్టువ్యాధికి ప్రధాన లక్షణాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలలో రుబెల్లా వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ఇది గర్భం దాల్చిన మొదటి త్రైమాసికంలో పిల్లలకు తీవ్రమైన లేదా ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందన్నారు. శిశువుకు 9నెలల వయస్సు వచ్చిన తర్వాత ఒకటిన్నర సంవత్సరాల వయస్సులో వ్యాధి రాకుండా ఉండటానికి మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్‌ను రెండుసార్లు వేయించాలని డాక్టర్ అభ్యర్థించారు. జిల్లా ఆరోగ్య వైద్యారోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ హెచ్ దాసప్పనవర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభ దశలో నీరు నిలిచిపోకుండా చూడాలని దోమల ఉత్పత్తి వల్ల డెంగ్యూ వ్యాధి ప్రబలే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

చిన్నాపురం ప్రాంతాల్లో చిరుత సంచారం

కంప్లి, మే 17 : కంప్లి తాలుకా పరిధిలోని చిన్నాపురం గ్రామం చుట్టుపక్కల ప్రాంతాల కొండల్లో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గత రెండు మూడు రోజులుగా అర్ధరాత్రి వేళల్లో కూడా గ్రామంలోకి ప్రవేశించినట్లు రైతులు తెలిపారు. దీంతో గ్రామస్తులంతా తీవ్ర భయాందోళనలకు గురవుతున్నట్లు వాపోయారు. ఇప్పటికే రెండు మూడు మేకలపై చిరుత దాడి చేసినట్లు తెలిపారు. కావున చిన్నాపురం గ్రామం చుట్టూ హైమాక్స్ లైట్లు గానీ, కొండ చుట్టూ కంచెగాని ఏర్పాటు చేయాలని కోరారు.

క్రికెట్ స్టేడియం పనుల ప్రారంభం



హైస్కూలు గ్రౌండ్‌లో జరుగుతున్న క్రికెట్ స్టేడియం పనులు

సిరుగుప్ప, మే 17: రూ. ఐదు కోట్ల వ్యయంతో క్రికెట్ స్టేడియం పనులు జోరుగా జరుగుతున్నాయి. సిరుగుప్ప పట్టణం హైస్కూలు గ్రౌండ్‌లో నిర్మిత కేంద్ర శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ స్టేడియం ప్రహరీగోడ, సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో పనులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారి గోకుల్ తెలిపారు.

తాలుకాలో భారీ వర్షం

తోరణగల్లు, మే 17 : సండూరు తాలుకాలోని కొన్ని ప్రాంతాలలో తెల్లవారుజామున మూడు గంటల నుండి గంటన్నర పాటు వర్షం పడింది. సండూరులో 26.02 మిల్లీమీటర్లు, కురేకుప్పలో 38మిల్లీమీటర్లు, విఠలాపురంలో 23.08 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది.

ప్రారంభమైన రెయిన్‌బో మెగాఫన్ ఎగ్జిబిషన్



సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్ తదితరులు

బళ్లారి సిటీ, మే 17 : నగరంలోని రేడియోపార్కు ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో మెగాఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు మేనేజర్ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఎగ్జిబిషన్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఎగ్జిబిషన్‌లో మకాన్, ఇగోనో(ఊసరవెల్లి), షుగర్ ల్యాండర్, ఇమోబర్డ్స్, చిలుకలు, కోళ్ళు, కుక్క, పాములు, కొండచిలువలు, తదితర అన్యదేశ జంతువులు దర్శనమిస్తాయని తెలిపారు. ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల చేనేత వస్త్రాలు, ప్రత్యేక దుస్తులు, రోజువారీ వినియోగ వస్తువులు, వంటగది, తోట వస్తువులు ఇంటి అలంకరణ వస్తువులు, పనిముట్లూ సహా వందకు పైగా ఇతర దుకాణాలు ప్రారంభించామన్నారు. చిన్నారుల వినోదం కోసం ప్రత్యేకంగా వాటర్ బోట్, మినీ ట్రైన్, ప్లే ఎక్విప్‌మెంట్ జాయింట్ వీల్ గేమ్స్ పాశ్చాత్యస్టైల్ బ్రేక్‌పాస్ట్‌ను కూడా ప్రవేశపెట్టారు. ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందన్నారు. దీనిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రియాజ్ అహ్మద్, ఫెయిర్ యజమాని చంద్రమూర్తి, సమావేశంలో ఆర్ మనోహర్, శ్రీరామచంద్రమూర్తి, జాకీర్, వెంకటేశ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దొడ్డ ఆంజనేయస్వామి రథోత్సవం



కంప్లి, మే 17: జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో ప్రసిద్ధి గాంచిన దొడ్డ ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం కుడితిని పట్టణంలో కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి తెలిపారు. గత రెండు మూడు రోజులుగా ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. ప్రతినిత్యం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. ఏటా ఈ రథోత్సవాన్ని జిల్లా పరిధిలో గుర్తుండిపోయేలా జరుపుతారు. స్వామివారికి శుక్రవారం పుష్పాలతోను, వెన్నతోను ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

ఏపీలో ప్రభుత్వ ఏర్పాటుపై జోరుగా బెట్టింగ్‌లు

బళ్లారి, మే 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణా, కర్ణాటక ఇతర రాష్ట్రాల్లోనూ ఏపీ రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వంపై రాజకీయ చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఏపీలో టీడీపీ, జెఎస్‌పీ,బీజేపీ పార్టీల కూటమి అధికారంలోకి వస్తుందని, తెలుగుదేశం పార్టీ గర్నమెంట్ ఫాం చేస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని కొందరు బెట్టింగ్ కాస్తుంటే, కాదు ఐ ప్యాక్ చెప్పిందట, ఖచ్చితంగా జగన్ రెండోసారి సీఎం అవుతారని మరికొందరు జోరుగా బెట్టింగ్‌లు కాస్తున్నారని సమాచారం

టీడీపీ తరపున బెట్టింగ్ కాసే వాళ్ల మేము రెడీ అంటుంటే, వైఎస్సార్ సీపీ వారు మేకపోతు గాంభీర్యం చూపుతున్నారే కానీ డబ్బులతో రంగంలోకి దిగడం లేదని తెలుస్తోంది. ముంబాయికి చెందిన కొందరు బెట్టింగ్ ఆడేవాళ్లు ఏరాష్ట్రంలో ఎన్నికలు జరిగినా బెట్టింగ్‌కు దిగుతారు. వారికి ఏపార్టీతో సంబంధం ఉండదు. కేవలం బెట్టింగే వారి వ్యాపారం. ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ ముంబాయ్ బెట్టింగ్ పార్టీ కూడా పందెం కాస్తోంది. అలాగే అంతే కాకుండా ఏ నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే గెలుస్తారు అనేది కూడా విత్ మెజార్టీతో కలిపి బెట్టింగ్ కాస్తున్నారు. వాస్తవానికి రాయలసీమ జిల్లాలతో సంబంధం లేకుండానే కోస్తా, ఆంధ్ర జిల్లాల నుండే తెలుగుదేశం పార్టీ కూటమి అఖండ మెజార్టీ సాధిస్తుందని పందెం కాస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం కూటమి ఏపీలో అధికారంలోకి వస్తుందని బెట్టింగ్ కట్టేందుకు ఆపార్టీ శ్రేణులు, బెట్టింగ్ ఆడే టీంలు ముందుకొచ్చాయి. కానీ వైసీపీ నుండి మాటలే కానీ ఎవరూ చేతలతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మొత్తం మీద ఏపీ రాజకీయం పై కర్ణాటకలో చాలా ఆసక్తి కరంగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి.


ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన వరల్డ్ సోషల్ హెల్త్ బృందం



సిరుగుప్ప ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన వరల్డ్ సోషల్ హెల్త్ బృందం

సిరుగుప్ప, మే 17 : టీకాలు వేసుకోవడం మనిషి ఆరోగ్య దృష్ట్యా మంచిదని బెంగళూరు ప్రపంచ సోషల్ హెల్త్ అధికారి డాక్టర్ సిద్దలింగయ్య తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిని ఆయన సందర్శించారు. తాలుకా వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణతో పిల్లలకు టీకాలు వేయడంపై సమావేశం నిర్వహించారు. టీకాలు వేయడం వలన పిల్లల మరణాలు వుండవని ఆయన తెలిపారు. కరోనా సమయంలో కోవిడ్ వ్యాక్సిన్ వేయడం వలన అందరి ప్రాణాలు కాపాడగలిగామని ఆయన తెలిపారు. ఎవరో ఒక్కరికి వ్యాక్సిన్ రియాక్షన్ ఇస్తే దాని విరుగుడుకు మందు వుందని తెలిపారు.

పక్షుల దాహం తీరుస్తున్న ప్లాస్టిక్ డబ్బాలు



చెట్లకు డబ్బాలు కట్టిన బాషా

బళ్లారిరూరల్, మే 17 : బళ్లారి తాలుకాలోని మీనళ్లి గ్రామానికి చెందిన అహమ్మద్‌బాషా పక్షుల దాహం తీరుస్తున్నాడు. అతడు ఒకరోజు పనులకు వెళ్లి బహిరంగ ప్రదేశంలో భోజనంచేసే సమయంలో పక్షులు తన దగ్గరకు వస్తున్నట్లు గమనించాడు. అవి ఆయనను చూసి భయపడి మళ్లీ దూరంగా వెళ్లడంతో పక్షులు దాహార్తితో అలమటిస్తున్నట్లు అర్థం చేసుకున్నాడు. తాను మూగజీవులకు ఏదో ఒకటి చేయాలన్న ఉద్దేశంతో మరుసటి రోజునే కిరాణ షాపులకు వెళ్లి ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి హగరి నుంచి మీనళ్లి వరకు రోడ్డుకిరువైపులా వున్న చెట్లకు వాటిని అమర్చాడు. ప్రతి రోజు ఉదయాన్నే తన ద్విచక్రవాహనంలో బిందెతో నీటిని తీసుకుని ఆ ప్లాస్టిక్ డబ్బాలలో నీటిని నింపుతున్నాడు. దీంతో పక్షులు వాటిపై వాలి తమ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. ప్లాస్టిక్ డబ్బాలను ఏర్పాటు చేసి పక్షుల దాహార్తిని తీర్చుతున్న అతడిని పలువురు అభినందిస్తున్నారు.

అమర్‌నాథ్ పటేల్‌ను గెలిపించండి



బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి

కంప్లి, మే 17 : రానున్న ఈశాన్య పదవీధార క్షేత్రం నుంచి బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పటేల్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. కంప్లి పట్టణం బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అమర్‌నాథ్ పటేల్ ఎంతో పేరుగాంచిన వ్యక్తి అని, అతనిని గెలిపించుకున్నట్లయితే అభివృద్ధి ముందుకు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ముందుకొచ్చి తమ అమూల్యమైన ఓటును బీజేపీకి వేసి గెలిపించాలని కోరారు. వారితో పాటు తాలుకా అధ్యక్షులు హళ్లళ్లి వీరేష్, విరుపాక్షిగౌడ, సిద్దప్ప, పురుషోత్తమ్, సుధాకర్, గోవిందు, కుమార్, సుదర్శన్ రెడ్డి, హనుమంతు, అనిల్ నాయుడు , ఎస్‌ఎం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్షం దెబ్బకు నేలకొరిగిన ఇళ్లు



దేవలాపురంలో జానూరు గంగాధర ఇల్లు నేలకొరిగిన దృశ్యం

కంప్లి, మే 17 : కంప్లి తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి గ్రామంలోని 4వవార్డు కొత్తనగర్‌లో పీడీ శివన్న, జానూరు గంగాధర ఇళ్లు నేలకొరిగాయి. అలాగే కుడితిని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో కూడా పూర్తిగా నీరు చేరుకుని రోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. గురువారం కురిసిన వర్షానికి కంప్లి తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో ఇళ్లు నేలకూలాయి. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని గ్రామలెక్క అధికారులు కూలిన ఇళ్లపై సర్వే చేపడుతున్నారు. త్వరలో వారికి నష్ట పరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదికలు పంపామని అధికారులు తెలిపారు.

హోసూరు జోన్

వైభవంగా కావేరి అమ్మవారి ఉత్సవం



అగ్నిప్రవేశం చేస్తున్న అమ్మవారు

హోసూరు, మే 17: హోసూరు సమీపంలోని తోటగిరి కావేరి అమ్మ ఆలయం 75వ వార్షిక ఉత్సవంలో భాగంగా శుక్రవారం విశేష కార్యక్రమాలు సాగాయి. ఈనెల 9న ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం అగ్నిగుండ ప్రవేశంతో పూర్తయ్యాయి. ప్రతిరోజూ విశేషపూజలు, అభిషేకాలు, అలంకరణలు కొనసాగాయి. గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షా కవచం, సూక్త హోమం, దుర్గా హోమం నిర్వహించారు. చివరిరోజు విశేష పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నబ్యాలగొండలో పాఠశాల గదులకు భూమిపూజ

హోసూరు, మే 17: టైటాన్ ఇంజనీరింగ్ ఆటోమెషన్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమం క్రింద హోసూరు చుట్టుప్రక్కల అనేక గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. హోసూరు చిన్న బ్యాలగొండపల్లిలోని పంచాయతీ యూనియన్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ వినతిమేరకు సంస్థ సానుకూలంగా స్పందించింది. ఇక్కడ 40 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. శుక్రవారం పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

బర్డ్ ఫ్లూ నియంత్రణపై సమీక్ష

హోసూరు(కృష్ణగిరి), మే 17: పశుసంవర్ధశాఖ నేతృత్వంలో బర్డ్‌ఫ్లూ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సరయు సమీక్షించారు. కృష్ణగిరి కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రత్యేకించి శ్వాసకోశ సమస్యలను కలిగించే అంశం కావడంతో తీవ్రంగా పరిగణించి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. పౌల్ట్రీ రంగంలో పనిచేసే కార్మికులు ముఖానికి మాస్క్ వేసుకోవడం, చేతులకు గ్లోవ్స్ ధరించడం ద్వారా కనీస జాగ్రత్తలు పాటించేలా చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అలాగే ఈ వ్యాధి కోళ్లు, బాతులు, పెద్ద బాతులు, గినియా కోళ్లు, కోళ్లు, పిట్టలకు వ్యాపిస్తుంది. వ్యాధి గ్రస్తులైన పక్షులు ఆహారం తీసుకోకపోవడం, నీరసం, గుడ్డు ఉత్పత్తి తగ్గడం, దగ్గు, తుమ్ములు, గురక, కళ్లు, నోరు, ముక్కు, మలవిసర్జన, తల, కనురెప్పలు, గిట్టలు, ముఖ కండరాలు వేలాడదీయడం, నీటి గ్రంథులు వాపు ఇటువంటి లక్షణాలు ఏర్పడుతాయి. కేరళలోని అలప్పుజాలో ఏవియన్ ఫ్లూ గుర్తించినందున కేరళ రాష్ట్రం నుంచి కోళ్లు, గుడ్లు, బాతులు, కోళ్ల దాణాకు సంబంధించిన వాటిని కొనుగోళ్లు చేయరాదన్నారు. ఒకవేళ గతనెలలో కేరళ రాష్ట్రం నుంచి కొనుగోలు చేసినవి నిల్వ ఉంటే ధ్వంసం చేయాలన్నారు. కోళ్లు చనిపోతే వెంటనే పశుసంవర్ధక శాఖకు తెలియజేసేలా పౌల్ట్రీ నిర్వాహకులకు సూచించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన 30 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అత్యవసర అవసరాలకోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో అసోసియేట్ డైరెక్టర్ మెయింటినెన్స్ ఇళంగోవన్, డిప్యూటీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆరుళ్‌రాజ్, సహాయ సంచాలకులు మున్సిపాలిటీలు మహదేవన్, పశువైద్యులు మహేంద్రన్, జ్యోతిబసు, రవిచంద్రన్, స్వామినాథన్, భువనేశ్వరీ కార్పొరేషన్, మున్సిపల్ అటవీ శాఖ అధికారులు, పౌల్ట్రీఫామ్ యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

వర్షంతో రాయచూరు అస్తవ్యస్తం

- పలుచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచి.. రాకపోకల బంద్





వర్షంతో అవస్థ పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

రాయచూరు, మే 17 : గడచిన రెండు నెలలుగా ఎండ వేడితో తల్లడిల్లిన ప్రజలు గురువారం రాత్రి విస్తారంగా కురిసిన వర్షం వల్ల ఊరట పొందినా, అకస్మాత్తుగా కురిసిన వర్షం వల్ల అనేక చోట్ల ఇబ్బందులు తలెత్తాయి. పలు గ్రామీణ ప్రాంతాల రోడ్ల పై వర్షపు నీరు వచ్చి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా కల్వర్టులు బలహీనంగా ఉన్న చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నగరంలోని ఒపెక్ ఆస్పత్రి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచి ఉండడంతో రాయచూరు-హైదరాబాద్ ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మాన్వి పట్టణంలోని సోనియా గాంధి కాలనీలో పలు ఇళ్ల ముందు ఉన్న రేకుల షెడ్లు కూలిపోయాయి. లింగసుగూరు తాలూకాలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున ఈదురు గాలులు, వర్షం కురువడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. గురుగుంటా గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ప్రాంగణంలో ప్రహరీ కూలిపడడంతో సమీపంలోని ఇళ్ల వారు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో పాటు గ్రామంలో పలు మట్టి ఇళ్లు కూలిపోయినట్లు గ్రామస్థులు వివరించారు. రాయచూరు తాలూకాలోని మన్సలాపూర్ గ్రామ సమీపంలో కుక్కనూర్‌కు వెళ్లె దారిలో ఉన్న పొలాల్లో నుంచి నారు పెద్ద ఎత్తున కొట్టుకువచ్చి రోడ్డుపై చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా జిల్లాలో అతిపెద్ద చెరువుగా ఉన్న మర్చడ్ గ్రామ చెరువు ఖాళీ కావడంతో లక్షల సంఖ్యలో ఉన్న చేపలు మృత్యువాతపడ్డాయి. గురువారం రాత్రి కురిసిన వర్షంతో చెరువులోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడంతో మిగిలిన చేపలు బతికాయని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా పలు గ్రామాలకు వెళ్లే దారుల్లో వాగులు,వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

హెచ్‌డీ దేవెగౌడ (పుట్టినరోజు)




దేశ 11వ ప్రధానిగా వ్యవహరించిన హెచ్‌డీ దేవెగౌడ (హరదనహళ్ళి దొడ్డేగౌడ దేవెగౌడ) 1933 మే 18న హాసన్ జిల్లా హొళెనరసీపుర తాలూకా హరదనహళ్లిలో జన్మించారు. జనతాదళ్ సెక్యులర్ (జేడీఎస్) పార్టీ జాతీయ అధ్యక్షుడు. 1994-96 మధ్య కర్ణాటక సీఎంగా, 1996-97 మధ్య దేశ ప్రధానిగా వ్యవహరించారు. కేంద్ర హోం మంత్రిగా, కర్ణాటక ముఖ్యమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగారు. 1960 నుంచి రాజకీయాల్లో ఉంటూ కురువృద్ధుడిగా పేరొందారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన కుటుంబ సభ్యులు అత్యధికంగా రాజకీయాల్లో ఉంటూ వివిధ హోదాలలో ఉన్నారు.

సిజర్ నికోలస్ 2 (జయంతి)



రష్యాదేశ చివరి చక్రవర్తి నికోలస్-2 పలు ఆర్థిక, రాజకీయ సంస్కరణలు తీసుకొచ్చారు. 1868 మే 18న జన్మించారు. 1894 నుంచి 1917వరకు పాలించారు. మానవహక్కులు, విద్యా కార్యక్రమాలతో సమాజంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. చక్రవర్తిగా ఎంతో గుర్తింపు పొందారు. 1918 జూలై 17న హత్యకు గురయ్యాడు.

బెర్ట్రాండ్ రస్సెల్ (జయంతి)



నోబెల్ పురస్కార గ్రహీత బెర్ట్రాండ్ రస్సెల్ 1872 మే 18న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. తత్వవేత్త, తార్కికుడు, గణితశాస్త్రవేత్త, చరిత్ర కారుడు, రచయిత, సంఘ సంస్కర్త, రాజకీయనేత. నాస్తికుడైన ఆయన 'వై ఐయామ్ నాట్ ఏ క్రిస్టియన్' అనే గ్రంథం ఎంతోమందిని ప్రభావితం చేసింది. హైడ్రోజన్ బాంబును పగులగొట్టి పరీక్ష చేసినప్పుడు ఆయన తన రేడియో ప్రసంగంలో దానిని విమర్శించారు. 'మానవుడిని, మానవతను మరిచిపోవద్దు. అట్లా చేయగలిగితే స్వర్గానికి నిచ్చెనలు వేయబడతాయి.' అణ్వస్త్రధారణ నిరాసోద్యమ ప్రారంభానికి సహాయపడ్డారు. 1970 ఫిబ్రవరి 2న తన 97వ యేట కన్నుమూశారు.

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (జయంతి)



చారిత్రక పరిశోధకుడు, తెలుగులో తొలి విజ్ఞాన సర్వస్వ సృష్టికర్త కొమర్రాజు వెంకట లక్ష్మణరావు 1877 మే 18న కృష్ణా జిల్లా పెనుగంచి ప్రోలులో జన్మించారు. 'విజ్ఞానచంద్రికా మండలి' స్థాపకుడు. తెలుగు వారికి చరిత్ర పరిశోధనలు పరిచయం చేసి ఉన్నత ప్రమాణాలతో చరిత్ర, విజ్ఞాన రచనలను తెలుగులో అందించడానికి శ్రీకారం చుట్టిన ఉత్తమ విజ్ఞానవేత్త. నవయుగ వైతాళికులలో ఒకరిగా పరిగణిస్తారు. 46ఏళ్లకే మరణించినా తన కొద్దిపాటి జీవితకాలంలో ఒక సంస్థకు సరిపడా పనిని సాకారం చేసిన సాహితీ కృషీవలుడు. సాహితీమూర్తులకు ఆయన సహచరుడు, ప్రోత్సాహకుడు, స్ఫూర్తిప్రదాత. 1923 జూలై 14న కన్నుమూశారు.

పోప్‌జాన్‌పాల్ -2 (జయంతి)



క్యాథలిక్ చర్చ్ ముఖ్యులు, వాటికన్ సిటీ క్రైస్తవ గురువు, బిషప్ పోప్‌జాన్‌పాల్-2 ప్రపంచ వ్యాప్తంగా పేరొందారు. 1920 మే 18న పోలెండ్‌లో జన్మించారు. 1978 నుంచి 2005వరకు సుదీర్ఘ కాలం కొనసాగారు. 16వ శతాబ్దం నుంచి నాన్-ఇటాలియన్ పోప్‌గా గుర్తింపు పొందారు. ప్రపంచవ్యాప్తంగా 129 దేశాలను పర్యటించి శాంతికోసం పాటుపడ్డారు. 2005 ఏప్రిల్ 2న కన్నుమూశారు.

సీఆర్ సుబ్బరామన్ (జయంతి)



సీఆర్ సుబ్బరామన్ 1916 మే 18న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి ప్రాంతంలో జన్మించారు. సీఎస్ రామ్‌గా పేరొందారు. దక్షిణాదిన సినీ సంగీత దర్శకుడు, నిర్మాత. ఆయన పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా వాసులు. పదేళ్లపాటు తెలుగు, తమిళ సినిమాల లోనూ రాణించి సంగీతంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారు. ఘంటసాల వెంకటేశ్వరరావు, విశ్వనాథన్, రామమూర్తి, ఆర్ఎస్ గోవర్ధనం తదితరులు ఆయనవద్ద సంగీతంలో సహాయ దర్శకులుగా పనిచేసి కాలక్రమంలో ఎంతో పేరొందారు. దేవదాసు, రత్నమాల, చెంచులక్ష్మి, బాలరాజు, లైలా-మజ్ను వంటి సినిమాలు నిర్మించారు. 1952 జూన్ 27న కన్నుమూశారు.

చలం (జయంతి)



చలం 1929 మే 18న పాలకొల్లులో జన్మించారు. 1950-80 మధ్య ప్రముఖ తెలుగు సినీ నటుడు. కథానాయకుడిగా, హాస్యనటుడిగా, సహాయ నటుడి గాను రాణించారు. అంతేకాక నిర్మాత, ఆర్ట్ డైరెక్టర్, సెట్ డైరెక్టర్‌గా సత్తా చాటుకున్నారు. విభిన్నపాత్రలలో నటించి గుర్తింపు పొందారు. దాసి, సారంగధర, లంబాడోళ్ల రాందాసు, సంబరాల రాంబాబు, మట్టిలో మాణిక్యం వంటి సినిమాలు పేరొందాయి. జాతీయ సినీ అవార్డు పొందారు. 1989 మే 4న కన్నుమూశారు.

24 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

అగళి, మే 17: మండలంలో 24 నుంచి జూన్ 3వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12-45గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 24న తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లీష్, 28న మ్యాథ్స్ 29న ఫిజికల్ సైన్స్, 30న బయాలజీ, 31న సోషల్ స్టడీస్, జూన్ 1న ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపర్ -2 కాంపొజిట్ కోర్సు, జూన్ 3వ తేదీ ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టమోటాను దెబ్బకొడుతున్న ఆకుముడత

శిడ్లఘట్ట, మే 17: శిడ్లఘట్ట తాలూకాలో పట్టు సాగు అనంతరం టమోటా అధికంగా ఉంది. ప్రస్తుతం టమోటాధర కూడా ఆశాజనకంగా ఉంది. అయితే టమోటా పంటకు ఆకుముడత రోగం, గుండ్రనిపురుగు వ్యాధి సోకింది. దీంతో పంట దిగుబడి తీరని ప్రభావం చూపుతోంది. సుమారు 50శాతం దిగుబడి తగ్గినట్టు రైతులు వాపోతున్నారు. ఎండలు అధికంగా ఉండడంతో ఆకుముడత రోగం సామాన్యమని అయితే అనుకున్న దానికంటే ఎక్కువగా ఉందని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు అప్పు చేసి పంటలు పండిస్తున్నామని ఇటువంటి తరుణంలో రోగాలతో నష్టపోతున్నామన్నారు. ప్రస్తుతం తరుణంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి తగిన సలహా సూచనలు చేసి ఆదుకోవాల్సిన అవసరం ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.



ఆకుముడత సోకిన టమోటా పంట ఇలా...

బుద్ధిమాంద్యం పిల్లలకు ఉచిత నేత్ర పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

బంగారపేట, మే 17: బంగారపేట పట్టణంలోని అంతరగంగె బుద్ధిమాంద్య దివ్యాంగ పాఠశాల పిల్లలకు, వృద్ధులకు బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి, టైటాన్ కంపెనీ సహకారంతో శుక్రవారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన శంకర్ మాట్లాడుతూ 'నన్న కణ్ణు' పథకం కింద సుమారు ఆరు సంవత్సరాలుగా శంకర కంటి ఆసుపత్రి, టైటాన్ కంపెనీలు ఉచితంగా నేత్ర పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాయన్నారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ప్రబిన్, సునిల్‌లు నేత్ర పరీక్షలు చేశారు. ఆసుపత్రి క్యాంప్ ముఖ్యులు సంతోష్ మాట్లాడుతూ అన్ని ఇంద్రియాలలోకి కంటిచూపు ప్రధానమని కావున కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. శిబిరంలో 9మందికి కళ్లద్దాలు ఇచ్చారు. అదనపు చికిత్స, శస్త్రచికిత్సకు 9మంది ఎంపికయ్యారు. వీరిని బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సలు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అభిజిత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్త ఎల్ఎస్ శేషగిరి సేవలు ప్రశంసనీయం

బెంగళూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ శేషగిరిరావ్ కన్నడ, ఆంగ్ల భాషలలో సాహితీవేత్తగా రాణించి తనదైన ముద్రను చాటారని అర్థశాస్త్ర ప్రొధ్యాపకులు ఎస్ఎస్ శ్రీధరమూర్తి అభిప్రాయపడ్డారు. కన్నడ గెళెయర బళగ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలలలో ప్రొఫెసర్ ఎల్ఎల్ శేషగిరిరావ్ శతజయంతిలో పాల్గొని ప్రసంగించారు. బెంగళూరు విశ్వవిద్యాలయం ఏర్పాటు అయ్యాక కన్నడ సాహిత్యాన్ని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆయన రచించిన 30వేల పేజీలను గమనిస్తే ప్రధానంగా చరిత్రకారుడిగా భావించాలన్నారు. సాహిత్యానికి సంబంధించిన ఎన్నో అంశాలను శోధించి తన రచనల ద్వారా తెలియచేశారన్నారు. ఆంగ్ల సాహిత్యంపైనా, గ్రీకు నాటకాలు, మహాకావ్యాలంటే ఆయనకు ఎంతో ఆసక్తి అన్నారు. కన్నడ ప్రొధ్యాపకులు డాక్టర్ బీసీ నాగేంద్రకుమార్ ప్రసంగిస్తూ కన్నడ శ్రేష్ఠ విమర్శకులలో ఎల్ఎల్ రావ్ ఒకరన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాస్‌నాయక అధ్యక్షత వహించారు. కన్నడ గెళెయర బళగ అధ్యక్షుడు రా నం చంద్రశేఖర్ ప్రారంభోపన్యాసంలో ఎల్ఎస్ రావ్ శతజయంతి సందర్భంగా ప్రతి నెలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించదలిచినట్టు తెలిపారు. కన్నడ సంఘం కార్యదర్శి రుద్రేశ్ అదరంగి తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎస్ రావ్ చిత్రపటానికి పుష్పాంజలి

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

▸▸ చెట్ల తొలగింపుపై అసంతృప్తి

విజయపుర, మే 17: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని పురసభ సర్కిల్ నుంచి కోలారు రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు ఇరుగ్గా ఉందని కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ ఉన్నప్పటికీ చెట్లు తొలగించకుండా కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు మధ్య నుంచి 12 మీటర్ల వెడల్పు మేరకు విస్తరించదలిచారు. రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలను తొలగించేలా ఇప్పటికే గడువు ఇచ్చారు. దీంతో చాలావరకు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించారు. కాగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లను తొలగించే పనులు చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లు నీడతోపాటు పచ్చదనం కల్పిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. నాగుల కట్ట వద్ద ఉనన రావిచెట్లు, వేపచెట్లను కూడా తొలగిస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రజాపనులశాఖ నుంచి 56 చెట్లను తొలగించేందుకు అనుమతి వచ్చినట్టు అంటున్నప్పటికీ ఎన్ని చెట్లు తొలగించాలన్నది ఇంకా తీర్మానం కాలేదనే విమర్శలు ఉన్నాయి. అయితే పర్యావరణాన్ని కాపాడాలనే ప్రభుత్వమే ఇలా భారీ వృక్షాలను తొలగించేందుకు సిద్ధం కావడంపై పర్యావరణ ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ డీసీఎఫ్ సురేనా మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి చెట్లను తొలగించేందుకు అనుమతి ఉందన్నారు. ఎక్కడ అవసరమైతే అక్కడ మాత్రమే తొలగిస్తున్నామని మిగిలిన చోట్ల చెట్లకొమ్మలు తొలగిస్తున్నట్టు తెలిపారు. ప్రజాపనులశాఖ ఇంజనీర్ మురళి మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు 56 చెట్లను తొలగించేందుకు టెండరు అయ్యిందన్నారు. అందుకు సంబంధించి చెట్లకు మార్కింగ్ వేశామని, అడ్డుగా ఉన్న చెట్లను మాత్రమే తొలగిస్తున్నామని స్పష్టం చేశారు.



చెట్లకొమ్మలు తొలగిస్తున్న గ్రామస్థులు

రౌడీషీటర్‌పై కాల్పులు

దొడ్డబళ్ళాపుర, మే 17: హత్యకేసులో రెండో ఆరోపితుడిగా ఉన్న రౌడీషీటర్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన వేళ అతను దాడికి యత్నించడంతో పోలీసులు షూటౌట్ చేశారు. వివరాలిలా. ఈనెల 11న హేమంత్ గౌడను దారుణంగా హతమార్చిన కేసులో శ్రీనివాస్ రెండో ఆరోపితుడిగా ఉన్నాడు. దొడ్డబళ్ళాపుర గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం నిందితుడి ఆచూకీ తెలియడంతో యలహంక తాలూకా శ్రీరామనహళ్ళి ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు. నిందితుడు కూడా దాడికి ప్రయత్నించడంతో ఇన్‌స్పెక్టర్ సాదిక్‌పాషా ఆత్మరక్షణకు ఫైరింగ్ చేశారు. శ్రీనివాస్ కాలికి గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి పరిశీలించారు. హేమంత్‌గౌడను ఆసుపత్రికి తరలించారు. అతను కోలుకుంటున్నట్టు తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతైనా అవసరమని అభిప్రాయపడ్డారు.



షూటౌట్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మల్లికార్జున బాలదండి

జీవనశైలితోనే ఉత్తమ ఆరోగ్యం

మహదేవపుర, మే 17: సరైన ఆహార పద్ధతులు, క్రమబద్ధమైన జీవనశైలితోనే ఉత్తమ ఆరోగ్యం సాధ్యమని హైబీపీ, షుగర్ వంటివి రావని బెంగళూరు తూర్పు తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ కోమల అభిప్రాయపడ్డారు. కృష్ణరాజపుర ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం వరల్డ్ హైబీపీ డేను పురస్కరించుకుని ప్రత్యేక జాగృతి నిర్వహించారు. 60మందికిపైగా గర్భిణీలకు బీపీ పరీక్షలు చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ అశోక్‌రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ లీలా సంపత్, ఈఎన్‌టీ విభాగం డాక్టర్ సత్యనారాయణ, ఎన్‌సీడీ డాక్టర్ దాసురేశ్‌లు హైబీపీ నియంత్రణ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నిశా, నికిత, వింద్య, తాలూకా సీనియర్ అధికారి రాజు, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.



హైబీపీ సమస్యలపై ప్లకార్డుల ప్రదర్శన

మానవ హక్కులు ఎక్కడ..?

దాసరి కిరణ్‌పై దాడి పట్టదా..? ఇప్పటికీ నమోదు కాని కేసు ఆస్పత్రిలో ఉన్నా పట్టని పోలీసులు

అనంతపురం క్రైం, మే 17 : గొడవలు జరిగితే ఎక్కడైనా ప్రత్యర్థులు దాడి చేస్తారు. కొందరు చంపేయాలని చూస్తారు. కానీ తాడిపత్రిలో అందుకు భిన్నంగా జరిగింది. శాంతిభద్రతలను కాపాడే పేరిట అక్కడికి వెళ్లిన పోలీసులు.. ఏవో వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌ను చితకబాదాలని పోలీసులను డీఎస్పీ చైతన్య పురమాయించడం విస్మగొలుపుతోంది. ఆ తరువాత అతనిపట్ల వ్యవహరించిన తీరు అమానవీయంగా కనిపిస్తోంది. నిలువెల్లా రక్తంతో తడిసిపోయిన అతడిని చూసి.. ఎవరైనా నరికేశారేమో అనే భ్రమ కలుగుతుంది. పోలీసులు ఆ స్థాయిలో కొట్టారు. ఇంత జరిగినా ఏ ఒక్క పోలీసు అధికారీ అతని స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు. 'మెడికో లీగల్ కేసు' కూడా నమోదు చేయలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేయడం.. పోలీసుల వ్యవహారా శైలిని తెలియజేస్తోంది. యథేచ్ఛగా మానవహక్కుల ఉల్లంఘన జరిగినా.. సంబంధీకులు ఎవరూ స్పందిచకపోవడం విమర్శలకు తావిస్తోంది.



అనంతపురం ఆస్పత్రిలో దాసరి కిరణ్

బతుకుతానని అనుకోలేదు..!

అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో దాసరి కిరణ్ చికిత్స పొందుతున్నాడు. ఆ రోజు ఏం జరిగింది అని అడిగితే.. కన్నీటిపర్యంతమవుతూ.. 'నేను బతుకుతానని అనుకోలేదు.. విలేకరులు వచ్చి పలకరించేదాకా..' అని అన్నాడు.

అసలేం జరిగింది..?

"ఆ రోజు అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో పోలీసులు పెద్ద సంఖ్యలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి సమీపంలో తచ్చాడుతున్నారు. నేను ఇంకా పడుకోలేదు. ఇంటి ఆవరణంలో తిరుగుతున్నాను. ఓ పోలీసు ఇంటి గేటు తీశారు. దాసరి కిరణ్ నువ్వేనా అని హిందీలో అడిగారు. అవును అని చెప్పగానే డీఎస్పీ చైతన్య పిలుస్తున్నారని చెప్పారు. ఇంటి లోపలికి (జేసీపీఆర్ కుటుంబం ఉండే ప్రాంతం) వెళ్లగానే అక్కడ డీఎస్పీ చైతన్య, పోలీసులు ఉన్నారు. నన్ను చూడగానే బూతులు తిట్టారు. వీడిని లోపలికి వేయండి అని ఆదేశించారు. నన్ను కొట్టుకుంటూ బయట ఉన్న బస్సు లోపలికి తీసుకెళ్లారు. బస్సు లోపల లాఠీలతో చితకబాదారు. కాళ్లపై లాఠీ దెబ్బ పడటంతో కింద పడ్డాను. ఆ సమయంలోనే తలపై లాఠీలతో కొట్టారు. రక్తం కారుతున్నా వదిలిపెట్టలేదు. ఆ తరువాత రూరల్ సీఐ లక్ష్మికాంతరెడ్డి వచ్చారు. సర్.. రక్తం ఎక్కువ కారుతోంది.. టార్చ్ లైట్ వేయండి అని అడిగాను. రక్తమొస్తే ఏమవుతుందిలే.. అరుగుతుందా తరుగుతుందా అని నిర్లక్ష్యంగా అన్నారు."

సీఐ మురళీకృష్ణ చూశాక..

"కొట్టడం అయ్యాక బస్సులోనే సజ్జలదిన్నె వద్దకు తీసుకెళ్లారు. అక్కడ బస్సు దిగే సమయంలో టౌన్ సీఐ మురళీకృష్ణ నా పరిస్థితి చూశారు. ఏమైంది అంటూ తన కర్చీఫ్ నా తలపై వేశారు. అక్కడున్న పోలీస్ సిబ్బందిని పిలిచి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చేసరికే నాకు మగత ఎక్కువైంది. ఏమైంది అని నర్సులు అడుగుతుంటే.. నరికి పడేస్తే చూసి తీసుకొచ్చాం అని ఎవరో చెప్పారు. అంతవరకే గుర్తుంది. రక్తగాయాలతో ఉన్న ఫొటో ఎవరు తీశారో గుర్తు లేదు. అది చూసి చాలామంది నేను చనిపోయానని అనుకున్నారు. మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారనుకుంటా. నాకు 6.30 గంటలకు మెలకువ వచ్చింది. ఆ తరువాత విలేకరులు వచ్చి పలకరించారు. అప్పటి వరకు నేను చచ్చాననే అందరూ అనుకున్నారు.."

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నంబులపూలకుంట, మే 17: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని హెచ్ఎం శిరీష తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలతో శుక్రవారం ఆమె విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. 2024-25 విద్యాసంవత్సరంలో పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ప్లస్ 2గా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపీసీకి 40, బైపీసీకి 40సీట్లు ఉంటాయన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లిష్ విద్యాబోధనతో విద్యాభ్యాసము ఉంటుందన్నారు.


గంగాభవాని అమ్మవారికి కరగ అలంకరణ



అమ్మవారికి అలంకరణ

చింతామణి, మే 17: పట్టణంలోని నారసింహపేటలో కొలువైన గంగాభవాని ఆలయ 21 వార్షిక గంగజాతర ఈనెల 28న జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం మొదటివిడత తృణముద్ద సమర్పించే కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలతో కరగ అలంకరణ జరిగింది. అర్చకుడు నారాయణస్వామి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ సాగింది. ఆలయం వద్ద గంగజాతర రోజున బలి ఇచ్చే దున్నపోతుకు కూడా విశేషపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో వివిధ స్థలాల్లో ఉంచిన నల్ల ముద్దలను ఆలయ కమిటీ ట్రాక్టర్ ద్వారా సేకరించి పట్టణ శివారులోని చెరువులో సమర్పించారు.

కైవార తాతయ్యకు విశేష పూజలు



విశేష అలంకరణలో కైవార తాతయ్య

శిడ్లఘట్ట, మే 17: పట్టణంలోని చింతామణి రోడ్డులో యతీంద్రనగర్‌లో కొలువైన కైవార యోగి నారేయణ తాతయ్య ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. బలిజ సేవా ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేకువజామున ఆలయ శుద్ధి, 7 గంటలకు అభిషేకం, అలంకరణ నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్త బృందం పాటలు, కీర్తనలు ఆలపించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పూడికతీత చేపట్టండి



కల్వర్టు వద్ద కాలువమధ్యలో పెరిగిన చెట్లు

చేళూరు, మే 17: తాలూకాలోని చాకవేలు నుంచి బిళ్ళూరుకు వెళ్లే మార్గంలో రాచెరువు సమీపాన గల వందమాను ఏటికాలువలో నీరు సజావుగా వెళ్లేందుకు వీలు లేకుండా పెద్దగా చెట్లు పెరిగాయి. కల్వర్టుల వద్ద సమస్య లేకుండా ముందస్తుగా పూడికతీత తదితర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువలో పూడిక తీత తొలగించడంతోపాటు నీరు సజావుగా వెళ్లేందుకు వీలుగా అవసరమైన మేరకు అడ్డంకిగా ఉన్నట్టు చెట్లను తొలగించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

దొమ్మసంద్ర, మే 17: బహిర్భూమికి వెళ్లిన బాలుడు శవమై కనిపించిన సంఘటన సర్జాపుర సమీపంలోని నెరిగా గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. ప్రాణేశ్ (13) మృతి చెందిన బాలుడిగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా మంత్రాలయ సమీపంలోని సుళకెరె గ్రామానికి చెందిన బసవరాజు, చెన్నమ్మలు మూడు నెలలక్రితం నెరిగా గ్రామానికి తాపీ పని కోసం వచ్చారు. స్వగ్రామంలో ఏడో తరగతి చదువుతున్న ప్రాణేశ్ ఇటీవల వేసవి సెలవులకు నెరిగా గ్రామానికి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం బహిర్భూమికి అని తల్లికి చెప్పి వెళ్లాడు. సాయంత్రం 7 గంటలైనా కనిపించలేదు. గురువారం మధ్యాహ్నం ఇంటి వెనుక పరిశీలించగా రక్తపుమడుగులో పడి ఉన్నాడు. తల, పొట్టకు బలమైన గాయాలు కావడంతో మృతి చెందినట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.